ప్రజాశక్తి
శనివారం 26 జులై 2025 8 పేజీలు


ప్రకాశం


బాపట్ల

సంపద పెంచితే
అందరి కష్టాలూ తీరతాయి..

- పన్నుల వల్ల ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతోంది..
- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్


మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-పర్చూరు

రాష్ట్రంలో రూ.90 వేల కోట్లు పెట్టుబడులు పెట్టడానికి ప్రైవేట్ కంపెనీలు ముందుకు వస్తున్నాయని, సంపద పెంచితే అందరి కష్టాలూ తీరతాయని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. 'సుపరి పాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మంత్రి కేశవ్ ఎమ్మెల్యే సాంబశివరావుతో కలిసి పర్చూరులో పర్యటించారు. బొమ్మల సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు సమర్పించి.. ఘన నివాళు లర్పించారు. పర్చూరులోని నెహ్రూ కాలనీలో రూ.80 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్లను, డ్రైన్లను మంత్రి ప్రారంభించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా.? అని మహిళలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏఎంసీ ▶ 2లో


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న గంగయ్య

'సీ మౌత్' పునరుద్ధరణ
ఐక్య పోరాటాలతోనే సాధ్యం

- సమస్య పరిష్కారం కోసం దశలవారీ ఆందోళనలు
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-చీరాల

ఈపురుపాలెం స్ట్రెట్ కట్ సీమౌత్‌ను దురాక్రమణదారుల నుండి కాపాడి.. దానిని పునరుద్ధరించాలంటే మత్స్యకారులతో ప్రజలందరూ ఐక్యమై.. సమస్య పరిష్కారంలో భాగస్వామ్యం కావాలని మత్స్యకారుల కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లాటి శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ మత్స్యకారుల మత్స్య కార్మిక సంఘం బాపట్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈపురుపాలెం స్ట్రెట్ కట్ సీ మౌత్ సమస్యపై అక్రమదారుల నుండి కాపాడి దానిని పునరుద్ధరించాలనే లక్ష్యంతో శుక్రవారం చీరాల ఎన్జీవో భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో వివిధ రాజకీయ, సామాజిక సంఘాల నాయకులు, స్థానిక నాయకులు, మత్స్యకార సమాజ ప్రతినిధులు హాజరై వారి అభిప్రాయాలు ▶ 2లో


మాట్లాడుతున్న చీకటి శ్రీనివాసరావు

స్మార్ట్ మీటర్లు వద్దు..

నేటి నుంచి ఇంటింటికీ ప్రచారం..

8లో

‘సీ మౌత్’ పునరుద్ధరణ ఐక్య పోరాటాలతోనే సాధ్యం

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ఈ సందర్భంగా కొల్లాటి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ మత్స్యకారుల సమస్యలను పరిష్కరించడానికి ఐక్యంగా, పోరాటం ద్వారానే సీమౌత్‌ని సాధించుకోవచ్చని పిలుపునిచ్చారు. బాపట్ల, చీరాల మధ్య సముద్ర తీరం క్రమంగా ప్రైవేటు వ్యక్తుల కబ్జాలోకి వెళుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈపురుపాలెం స్ట్రైట్‌కట్ సీమౌత్ కూడా జిల్లా అధికారుల సహకారంతో ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలోకి వెళ్లడంతో మత్స్యకారులు తమ వేట వృత్తిని కొనసాగించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సీమౌత్ దురాక్రమణ కారణంగా బోట్లు సముద్రంలోకి వెళ్లడం, తిరిగి ఒడ్డుకు చేరడం కష్టతరంగా మారడంతో సమస్య పరిష్కారం కోసం మత్స్యకారులు రోడ్డెక్కారని చెప్పారు. మత్స్యకారుల ఆందోళన నీరుగార్చడానికి కలెక్టర్ కమిటీ వేసి విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కమిటీ పేరుతో మత్స్యకారులను మభ్యపెట్టే అధికారులు కబ్జాదారుల ఆగడాలను అరికట్టడంలో మాత్రం విఫలమవుతున్నారని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య మాట్లాడుతూ మత్స్యకారుల సమస్యపై మత్స్యకార గ్రామాలతో పాటు ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు అందరూ ఏకతాటిపైకి వచ్చి సమస్యలో భాగస్వామ్యం అయినప్పుడే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. మత్స్యకారులు ప్రకృతి వైపరీత్యాల సమయంలో తమ పడవలను నిలపుదల చేసుకునేందుకు ఉన్న ఏకైక ఆధారం సీ మౌత్ అన్నారు. కావున మత్స్యకారులకు సిపిఎం అన్ని విధాలుగా అండగా ఉండి వారి సమస్య పరిష్కారం అయ్యేవరకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని స్పష్టం చేశారు. బలహీనవర్గాల సమాఖ్య నాయకులు గోసాల ఆశీర్వాదం మాట్లాడుతూ పర్యాటక రంగం అభివద్ధి పేరుతో స్థానిక మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీస్తున్నారని అన్నారు. గత 15 సంవత్సరాలుగా ప్రభుత్వం మినీ హార్బర్ నిర్మాణం గురించి హామీలిస్తూ వస్తున్నప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదని అన్నారు. సిపిఐ నాయకులు బత్తుల శామ్యూల్ మాట్లాడుతూ ఈపురుపాలెం సీ మౌత్ దురాక్రమణ మత్స్యకారులతో పాటు ఈ ప్రాంత రైతాంగంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు.

ఈ సమస్య పరిష్కారం కోసం కలిసి వచ్చే ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, స్థానిక వ్యక్తులు, శక్తులను కలుపుకొని ఐక్యంగా దశలవారీ ఆందోళనలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశానికి మత్స్యకారుల కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ గంగిరి ఏసుబాబు అధ్యక్షత వహించగా బీఎస్పీ నాయకులు సిర్ర భగత్‌సింగ్, సిపిఎం చీరాల కార్యదర్శి ఎన్.బాబూరావు, వాడరేవు మాజీ సర్పంచ్ ఎరిపెల్లి రమణ, ప్రజా సంఘాల నాయకులు నాయుడు నాగార్జున రెడ్డి,దాసరి ఇమ్మానుయేల్, శీలం రవికుమార్, కెవిపిఎస్ నాయకులు లింగం జయరాజు, తాడిబోయిన లక్ష్మి ప్రసాద్, సవనం సంయెల్, సీఐటీయూ నాయకులు ఇమ్మానియేల్, మస్తాన్‌రావు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి అవకాశాలు పెంచుకోవాలి

ప్రజాశక్తి-పొదిలి

గ్రామాల్లో సంఘాల్లో ఉండే మహిళలు స్వయంగానే ఉపాధి అవకాశాలు పెంచి కుటుంబానికి బాసటగా నిలవాలని కేంద్ర బృందం అధికారులు సూచించారు. శుక్రవారం మండలంలోని ఆముదాలపల్లి, మూగచింతల గ్రామాలలో రెండో రోజు కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో బృందం సభ్యులు ప్రభాస్ శర్మ, డ్వాక్రా మహిళలు, వికలాంగ వృద్ధాప్య పింఛన్లు తీసుకుంటున్న లబ్ధిదారులు, ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. డ్వాక్రా మహిళలు సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ ద్వారా రుణాలు పొందుతున్న మహిళలు వారి జీవన విధానంలో మెరుగైన పరిస్థితులకు చేరుకునేందుకు అందుబాటులో ఉన్న వనరులు ఉపయోగించి రోజువారి ఆర్థిక స్వావలంబన సాధించాలని అన్నారు. బృందం సభ్యులు ప్రభాత్ శర్మ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు ఆర్థిక స్వావలంభన సాధిస్తే వారి కుటుంబాలు అభివృద్ధిలోకి వస్తాయన్నారు. గ్రామంలో వితంతు, వికలాంగ బధిరుల పెన్షన్ లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎల్‌ఎం టీం సభ్యులు నందలాల్ గుర్జార్, డిఆర్డిఏ, డుమా ఏపీడీలు లక్ష్మిరెడ్డి, బసవ సుబ్బారావు, ఎంపీడీవో గుత్తా శోభన్‌బాబు, సర్పంచులు సిరిమల్లె శ్రీనివాసులు, ఏపీవో మహాలక్ష్మి, ఏటీఎం గోపాలకృష్ణ, హౌసింగ్ ఏఈ వెంకటరెడ్డి, పిఆర్ ఏఇ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు సునీత, గోపి, వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కల్పన

పెండింగ్ జీతాలు ఇవ్వాలి: సిఐటియు

ప్రజాశక్తి-కంభం

స్థానిక జిఆర్ఆర్ అండ్ డిపిఆర్ కాలేజీలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమావేశం సరళ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా కార్యదర్శి కల్పన, సిఐటియు మండల కార్యదర్శి ఎస్కె అన్వర్ ప్రసంగించారు. వారు మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా మిడ్ డే మీల్స్ వర్కర్‌కు మెనూ చార్జి పిల్లవాడికి 20 రూపాయలు ఇవ్వాలని కోరారు. మిడ్ డే మీల్స్ వర్కర్‌కు నెలకు కనీసం పదివేల రూపాయలు జీతం ఇవ్వాలని అన్నారు. అలాగే మిడ్ డే మీల్స్ వర్కర్‌కు బకాయి ఉన్న 12 నెలల జీతం ఇవ్వాలని కోరారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ కంభం మండల కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్ష కార్యదర్శులుగా సరళ, జి కెతురను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షురాలుగా ఏ మహాలక్ష్మి, వి సీత, సహాయ కార్యదర్శులుగా మండల ఉమా నాగలక్ష్మి, కే ఆవులమ్మ, ఎస్‌డి హాలీమా, కమిటీ సభ్యులు పదిమందిని ఎన్నుకున్నారు.

లోకోస్ యాప్‌పై శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-తర్లుపాడు

మండల కేంద్రమైన తర్లుపాడు స్త్రీ శక్తి భవనంలో వెలుగు ఏపీఎం రమేష్‌బాబు ఆధ్వర్యంలో లోకోస్ యాప్‌పై రెండు రోజుల పాటు గురు, శుక్రవారాలలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలో శిక్షణ పొందిన సిఆర్పిలు జి ఈశ్వరి, షేక్ ముబీనా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సమగ్రమైన, ఖచ్చితమైన సమాచారం తెలుసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం లోకోస్ యాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. దేశంలోని స్వయం సహాయక సంఘాల పూర్తి సమాచారాన్ని ఈ యాప్ ద్వారా తెలుసుకునే వెసులుబాటు కల్పించిందని, ప్రస్తుతం స్వయం సహాయక సంఘాల పొదుపు లెక్కలు, సంఘాల పనితీరు, సంఘాలలోని సభ్యుల సంఖ్యను బుక్ కీపింగ్ లేదా మొబైల్ బుక్ కీపింగ్, అకౌంటింగ్ యాప్, నేషనల్ రూరల్ లైవ్ లీవ్డ్ మిషన్ యాప్ ద్వారా నిర్వహిస్తున్నారన్నారు. మహిళా సంఘాల సభ్యులకు సంబంధించి బ్యాంకు రుణాలు, పొదుపు లెక్కలు ఒక సంఘానికి సంబంధించిన మాత్రమే తెలుసుకునే వెసులుబాటు ఉండేది. ఈ యాప్ ద్వారా సంఘాల్లోని సమాచారాన్ని ఒక క్లిక్‌తో ఎక్కడి నుంచి అయినా తెలుసుకోవచ్చు అన్నారు. డిజిటలైజేషన్ ద్వారా అన్ని సంఘాలు చైతన్యవంతమయ్యాయని, గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే అప్పులు, పొదుపు లెక్కలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం నుంచి తీసుకునేదని, ఈ మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వం మహిళా సంఘాల సమాచారాన్ని ప్రత్యేకంగా రూపొందించిన యాప్లలో పొందుపరుస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో సిసి సురభయ్య, అకౌంటెంట్ శ్రీదేవి, మండలంలోని వివోఏలు పాల్గొన్నారు.

సంపద పెంచితే.. అందరి కష్టాలూ తీరతాయి..

(మొదటిపేజీ తరువాయి)

మార్కెట్ యార్డులో నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి కేశవ్ మాట్లాడారు. సిఎం చంద్రబాబు నాయుడుపై ఉన్న నమ్మకంతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి పెద్ద పెద్ద కంపెనీలు వస్తున్నాయని, దీంతో ట్యాక్స్ కట్టే వారి సంఖ్య పెరిగి ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందని చెప్పారు. అలాగే ఉద్యోగాల కల్పన కూడా జరుగుతోందని చెప్పారు. ప్రజల ఆశయాలు ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. రాష్ట్రానికి బ్యాంకు రుణాలు ఇవ్వొద్దని వైసిపికి చెందిన 200 మంది ఈ-మెయిళ్లు పెట్టారని ఆరోపించారు. రాష్ట్రానికి రుణాలు రాకుండా చేస్తున్నారని.. తినే అన్నంలో మన్ను కొడుతున్నారని విమర్శించారు. అలాంటి వారిపై కేసులు పెడతామని హెచ్చరించారు. ఎన్నడూ లేని విధంగా బర్లీ పొగాకు రైతుల సమస్య రాష్ట్రంలో ఏర్పడిందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సీఎం దష్టికి, వ్యవసాయ శాఖ మంత్రి దష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి రైతులను ఆదుకున్నట్లు చెప్పారు. ధాన్యం రైతులకు డబ్బులు చెల్లించి ఆదుకున్నామని చెప్పారు. ఎమ్మెల్యే సూచించిన నియోజకవర్గంలోని అభివద్ధి పనులు పూర్తి చేయిస్తామని చెప్పారు.

ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ వర్షాకాలంలో నక్క వాగు పొంగి పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయని. రైతులు తీవ్రంగా సమస్యను ఎదుర్కొంటున్నారని మంత్రి దష్టికి తీసుకువెళ్లారు, అలాగే వాగు వెడల్పు చేయాలని, పూడికతీత పనులు చేయాలని అవసరమైతే ఐదు నుంచి పది ఎకరాలు వాగు అభివద్ధికి సేకరించాలని మంత్రికి వివరించారు. లిఫ్ట్ ఇరిగేషన్లకు నిధులు మంజూరు చేయాలని కోరారు. సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేస్తామని మంత్రి చెప్పారు. ముందుగా పర్చూరు మార్కెట్ యార్డ్ లో రైతులు పండించిన పొగాకును పరిశీలించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లావన్న, ఆర్డీవో గ్లోరియా, ఏఎంసీ ఛైర్మన్ గుంజి వెంకటరావు, టిడిపి ఆరు మండలాల మండల అధ్యక్షులు షేక్ షంషుద్దీన్, టి.నాగేశ్వరరావు, టి శ్రీహరి, రంగయ్య చౌదరి, పొదవీరయ్య నాయుడు హనుమంతరావు, కారుమంచి కష్ణారావు, దాసి కిరణ్, ఆకుల శ్రీనివాసరావు పొగాకు రైతులు పాల్గొన్నారు.

1న వాహన వేలం

ఒంగోలులోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ వారు సీజ్ చేసిన టివిఎస్ ఎక్స్‌ఎల్ వాహనాన్ని వచ్చే నెల 1న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సిఐ లీనా ఒక ప్రకటనలో తెలిపారు.

రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు : మంత్రి



ప్రజాశక్తి-టంగుటూరు

కొండపి నియోజకవర్గంలోని నూతన రహదారుల నిర్మాణానికి రూ.34 కోట్ల రూపాయల నిధులు మంజూరైనట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు.పాలేరు వాగుపై ముప్పాళ్ల- పైడిపాడు రోడ్డు బ్రిడ్జి నిర్మాణానికి రూ.28 కోట్లు, టంగుటూరు – పాకల రోడ్డుకు రూ.6 కోట్లు కలిపి రూ.34 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఈ సందర్భంగా మంత్రి స్వామి కతజ్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న ఐపిఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి

విద్యార్థులు కష్టపడి చదవాలి

ప్రజాశక్తి-శింగరాయకొండ

విద్యార్థి దశలోనే కష్టపడి చదివితే ఏమైనా సాధించవచ్చు అని ఐపిఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి తెలిపారు. శింగరాయకొండ మండలం మూలగుంటపాడు గ్రామంలోని శ్రీ విద్యానికేతన్ పాఠశాలలో మై రోల్ మోడల్ అనే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉదయ్ కష్ణారెడ్డి మాట్లాడుతూ కష్టపడి విద్యార్థి దశ నుంచి ఓ గోల్ అనుకొని ముందుకు పోతే ఏదైనా సాధించవచ్చునని వివరించారు. విద్యార్థినీ, విద్యార్థులు చెడు అలవాట్లకి లోను కాకుండా కష్టపడి చదవాలన్నారు.విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఉదయ్ కష్ణారెడ్డి సమాధానం చెప్పారు.. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సైకం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి- పిసిపల్లి

కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించినట్లు ఈ సందర్భంగా బాలికల ఎత్తు , బరువు, రక్తశాతాన్ని పరీక్షించినట్లు ఆమె తెలిపారు. విద్యార్థినులకు సీజన్ వ్యాధులపట్ల అవగాహన కల్పించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించినట్లు తెలిపారు. యుక్తవయసులో బాలికలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి.సుజాత, వైద్య సిబ్బంది రేణుక, భాగ్య వేణి ,జక్రయ్య, ఎంఎల్ హెచ్ పి ,ఆశా వర్కర్లు పాల్గొన్నారు



సినిమా షూటింగ్‌లో ఓ సన్నివేశం

దర్శిలో సినిమా షూటింగ్

ప్రజాశక్తి-దర్శి

దర్శిలోని కనకదుర్గమ్మ అమ్మవారి గుడి వద్ద దక్షిణ కాళీ అనే సినిమా షూటింగ్‌ను శుక్రవారం ప్రారంభించారు. సినిమా షూటింగ్‌ను టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి క్లాప్ కొట్టి ప్రారంభించారు. నిర్మాత మీసాల వాణి ఆధ్వర్యంలో షూటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు తోట కష్ణ, హీరో చంద్రగిరి సుబ్బు, హీరోయిన్ ప్రియాంక విలన్, ఆజాద్ పాల్గొన్నారు. సినిమా షూటింగ్‌ను చూసేందుకు చుట్టుప్రక్కల గ్రామాల నుంచి ప్రేక్షకులు భారీగా తరలివచ్చారు.

సిపిఎం శాఖ సభ్యులు అంకమ్మ మృతి



అంకమ్మ (ఫైల్)



నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి -నాగులుప్పలపాడు

నాగులుప్పలపాడు మండలం ఒమ్మెవరం గ్రామానికి చెందిన సిపిఎం శాఖ సీనియర్ సభ్యులు నక్కల అంకమ్మ (75) అనారోగ్యంతో శుక్రవారం మతి చెందాడు. ఈ విషయం గురించి తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె. మాబు అంకమ్మ మతదేహాన్ని సందర్శించి సిపిఎం జెండా కప్పి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు అంకమ్మ మృతి పార్టీకి తీరని లోటని తెలిపారు. అంకమ్మ 2011 నుంచి శాఖా సభ్యుడిగా కొన సాగుతున్నారన్నారు. పార్టీట్ట చేపట్టిన ప్రజా, రైతాంగ, కార్మిక ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారన్నారు నివాళులర్పించిన వారిలో సిపిఎం జిల్లా_నాయకులు బి. రఘురాం, మండల కార్యదర్శి టి.శ్రీకాంత్, యు.వెంకటేశ్వర్లు , కాకాని సుబ్బారావు, కండ్లగుంట శ్రీనివాసరావు,అత్తంటి సురేష్, ఎ. వెంకటసుబ్బయ్య తదితరులు ఉన్నారు.

విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు మృతి



వెంకటేశ్వర్లు (ఫైల్)

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం కలికివాయ గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, ప్రముఖ నాటక నటుడు మరియు సినీ నటుడు గుంజి చిన్నవెంకటేశ్వర్లు (78) శుక్రవారం మృతిచెందారు. వెంకటేశ్వర్లు సుదీర్ఘ కాలం పాటు ఎఎస్ఎస్‌టి ఎలిమెంటరీ స్కూల్, సుందర్‌నగర్, శింగరాయ కొండలో హెడ్‌మాస్టర్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేశారు. ఉపాధ్యాయ వత్తిలోనే కాకుండా కళా రంగంలోనూ ఆయన తనదైన ముద్ర వేశారు. వేదికలపై అనేక నాటకాలు ప్రదర్శించారు. చింతామణి నాటకంలో సుబ్బిశెట్టి పాత్ర ఆయనకు రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చింది. భావావేశం, స్వరపాటవం, పాత్ర జీవం నాటకాల్లో ఆయన నటన ప్రత్యేకమైనదిగా నిలిచింది. సినీ రంగంలో కూడా ఆయన పలు చిత్రాల్లో ముఖ్య పాత్రలు పోషించారు. ముఖ్యంగా ఎర్రమందారం, సగటు మనిషి చిత్రాల్లో నటించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నాయి. వెంకటేశ్వర్లు నాటక రంగాన్ని సామాజిక బాధ్యతగా భావించి, దాని ద్వారా సమాజంలో చైతన్యం కల్పించే ప్రయత్నం చేశారు. ఆయన మతితో కళారంగం ఓ ఆదర్శవంత కళాకారుడిని కోల్పోయింది. వెంకటేశ్వర్లు మతిపట్ల కళా రంగం ప్రతినిధులు, వడ్డెర సంఘం నేతలు, విద్యా రంగ స్నేహితులు, గ్రామస్తులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. వెంకటేశ్వర్లు మతదేహాన్ని బంధుమిత్రులు, అభిమానులు సందర్శించి ఘనంగా అంతిమ వీడ్కోలు పలికారు.

సౌభాగ్యమ్మకు ఎమ్మెల్యే నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ప్రజాశక్తి-చీమకుర్తి

కీర్తిశేషులు గోగినేని కోటయ్య సతీమణి గోగినేని సౌభాగ్యమ్మ (85) శుక్రవారం మృతిచెందారు. ఈ విషయం గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్ సౌభాగ్యమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో మద్దిపాడు ఎఎంసి చైర్మన్ మన్నం రాజేశ్వరి ప్రసాదు, టిడిపి పట్టణ అధ్యక్షుడు ముప్పూరి చలమయ్య, టిడిపి జిల్లా నాయకులు పమిడి వెంకటరావు, పమిడి రమేష్, కాట్రగడ్డ రమణయ్య, యడ్లపల్లి రాంబ్రహ్మం, కందిమళ్ల గంగాధర రావు, గొల్లపూడి కోటేశ్వరరావు, ఉన్నం సుబ్బారావు, పమిడి రవితేజ, రావిపాటి రాంబాబు, గొల్లపూడి సుబ్బారావు తదితరులు ఉన్నారు.

'సుపరిపాలన'తో సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి-దర్శి

సమస్యల పరిష్కారం కోసం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న టిడిపి దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. దర్శి నగర పంచాయతీలోని 9వ వార్డులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజలకు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ సారధ్యంలో ప్రజలందరూ ఆనందంగా సుభిక్షంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఎఎంసి చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, టిడిపి అధ్యక్షుడు పుల్లలచెరువు సత్యనారాయణ, నగర పంచాయతీ కమిషనర్ వై.మహేశ్వరరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న గొట్టిపాటి లక్ష్మి

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

ప్రజాశక్తి-పొదిలి, కొనకనమిట్ల

కెనరా బ్యాంక్ క్యాష్ పికప్ వాహనం అదుపు తప్పి ఢీకొన్న ఘటనలో దంపతులకు గాయ్యాలయ్యి. ఈ ఘటన సంధ్యాల– ఒంగోలు రాష్ట్ర రహదారిపై కొనకనమిట్ల మండలం చిన్నారికట్ల జంక్షన్‌లోని పెట్రోల్ బంకు వద్ద శుక్రవారం చోటు చేశారు. అందిన వివరాల ప్రకారం.. చిన్నారి కట్ల గ్రామానికి చెందిన సోమ సుబ్బారెడ్డి, సుశీల దంపతులు పెట్రోల్ బంక్ సమీపంలోని తమ పొలంలో పనులు చూసుకొని టివిఎస్ మోపెడ్‌పై ఇంటి వస్తున్నారు. అదే సమయంలో ఒంగోలు నుంచి గిద్దలూరు వెళ్తున్న కెనరా బ్యాంక్ చెందిన క్యాష్ పికప్ వాహనం టివిఎస్ మోపెడ్‌ను ఢీకొంది. దీంతో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు క్షతగాత్రులను పొదిలి ప్రభుత్వ వైద్యశాల తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు హాస్పిటల్‌కు తరలించారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు మృతి



బండి వెంకటేశ్వర్లు(ఫైల్)

ప్రజాశక్తి- చీమకుర్తి

విశ్రాంత ఉపాధ్యాయుడు బండి వెంకటేశ్వర్లు (80) అనారోగ్యంతో శుక్రవారం మతి చెందారు. వెంకటేశ్వర్లు మాస్టారు సాయి సత్సంగ వ్యవస్థాపకులుగా, పద్మశాలి కుల గురువుగా అనేక సేవలందించారు. ఆయన భౌతికాయాన్ని యుటిఎఫ్ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళు లర్పించిన వారిలో యుటిఎఫ్ నాయకులు హరిప్రసాద్, రమేష్, పర్వతం భాస్కర్, పర్వతం వెంకటేశ్వర్లు, చదవాలి శ్రీనివాసరావు, ఎస్‌కె.అక్బర్, ఎస్.కె శిలార్, వసంతరావు ఉన్నారు.

వల్లూరమ్మ గుడిలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-టంగుటూరు

శ్రావణ మాసం శుక్రవారం సందర్భంగా మండలపరిధిలోని శ్రీ వల్లూరమ్మ దేవాలయం భక్తులతో కిట కిటలాడింది. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ వల్లూరమ్మను సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి రమేష్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

బంగారు కుటుంబాలను తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి- కనిగిరి

మండల పరిధిలోని పోలవరం పంచాయతీలో పి ఫోర్ సర్వే పై డిప్యూటీ ఎంపిడిఒ రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాగా చదువుకున్నవారు, వ్యాపారం నిర్వహిస్తున్న వారు, పెద్ద ఉద్యోగాలు చేస్తున్నవారు ఈపాటికే అభివృద్ధి చెందినవారు పేదరికంతో ఇబ్బంది పడుతున్న వారు అభ్యున్నతి సాధించేలా మార్గదర్శకం వహిస్తూ కషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంకమ్మరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. మండల పరిధిలోని బల్లిపల్లి గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్ వైజర్ పార్వతి మాట్లాడుతూ పి4 సర్వేలో గుర్తించిన కుటుంబాలలో అర్హులు మరియు అనర్హులను గుర్తించేందుకు గ్రామ సభ నిర్వహించినట్లు తెలిపారు. గ్రామంలో ఉన్నత స్థాయిలో ఉన్న వారు అట్టడుగు స్థాయిలో ఉన్న వారికి ఆర్థిక మరియు ఇతర అంశములలో సహాయం చేసిపైస్థాయికి తీసుకు రానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమములో పంచాయతీ కార్యదర్శి బి.మల్లికార్జున , సచివాలయం సిబ్బంది, అంగన్‌వాడీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మంత్రికి పిర్యాదు చేస్తున్న దివ్యాంగుడైన బాధితుడు

పొలం ఆక్రమించిన వారిపై ఫిర్యాదు

ప్రజాశక్తి- సంతమాగులూరు

తన పొలంలో 31 సెంట్ల భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకొని, తన భూమిని తనకు విడగొట్టాలని మక్కెన వారిపాలెంకు చెందిన తమ్మిశెట్టి కృష్ణ అనే దివ్యంగుడు మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో గ్రామానికి వచ్చిన మంత్రికి తనకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. గ్రామంలో తన పూర్వీకుల నుండి తనకు 1.431/2 ఎకరాల భూమి సంక్రమించిందని తెలిపారు. దివ్యాంగుడనైన తాను వ్యవసాయం సాగు చేయలేక తన ప్రక్క పొలంకు చెందిన గుంజి వెంకటేశ్వరరావుకు కౌలుకు ఇచ్చానని తెలిపారు. కొంతకాలం తర్వాత తాను పొలం వెళ్లి చూడగా తన పొలం హద్దురాళ్ళు తొలగించి 31 సెంట్లు భూమిని ఆక్రమించి ఉండడాన్ని గుర్తించానని తెలిపారు. వెంటనే కౌలు దారుని అడగ్గా బెదిరింపులకు పాల్పడినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ అక్కడే ఉన్న తహశీల్దారు రవిబాబును పిలిచి పొలం ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకొని, దివ్యాంగుడు కృష్ణకు తన భూమిని అప్పగించాలని ఆదేశించారు. మంత్రి వెంటనే స్పందించడంతో కృష్ణ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న ఆనందబాబు

రవికిరణ్ కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - అమృతలూరు

మండలంలోని మూల్పూరు గ్రామానికి చెందిన రవి కిరణ్ రౌడీల చేతిలో నాలుగేళ్ల క్రితం దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటనలో రవి కిరణ్ మృతదేహం కూడా లభ్యం కాకుండా అన్యాయం చేశారని అన్నారు. తెనాలిలోని టిడిపి నాయకులు శుద్ధపల్లి నాగరాజు కార్యాలయంలో రవి కిరణ్ తల్లి, దండ్రులకు రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని శాసన సభ్యులు నక్కా ఆనందబాబు చేతుల మీదగా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ రవికిరణ్ కుటుంబానికి టిడిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు శుద్ధపల్లి నాగరాజు, రవి కిరణ్ కుటుంబ సభ్యులు ఉన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ప్రజాశక్తి - చీరాల

ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుని వాటికి తక్షణమే పరిష్కారం చూపించాలన్న ఉద్దేశంతో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు శాసన సభ్యులు కొండయ్య తెలిపారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజలు వివిధ సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా 210 దరఖాస్తులు అందాయి. వాటిలో 40 దరఖాస్తులు పెన్షన్ కోసం ఉండగా, 170 దరఖాస్తులు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ప్రజల ఆవేదన చూసి వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అధికారులను పిలిచి సమస్యల పరిష్కారానికి ఆదేశించారు. ప్రజలకు సేవ చేయడమే తన ధ్యేయమని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పని చేస్తానని చెప్పారు. గ్రామాల అభివృద్ధి ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు.

పాఠశాల విద్యాభివృద్ధికి ప్రత్యేక కృషి

మక్కెనవారిపాలెంలో మంత్రి గొట్టిపాటి

ప్రజాశక్తి - సంతమాగులూరు

తమ ప్రభుత్వంలో పాఠశాల విద్యపై మంత్రి లోకేష్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని మక్కెనవారిపాలెం, కొమ్మాలపాడు గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు సందర్భంగా కొమ్మాలపాడు యూపీ పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు 104 మందికి, మక్కెనవారిపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు 349 మంది విద్యార్థులకు సిఎస్ఆర్ నిధులతో ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. సిఎం సహాయ నిధి కింద 46 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులు, ఎల్‌ఓసిలను పంపిణీ చేశారు. మక్కెనవారిపాలెంలో రు.30లక్షలతో సిసి రోడ్లు, సైడ్ డ్రైన్లను ప్రారంభించారు. అనంతరం సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమంలో ఆయన వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. తమ ప్రభుత్వంలో విద్యార్థులు మంచి వాతావరణంలో చదువుకునే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. మంచి భోజనం, బ్యాగు, నాణ్యమైన పుస్తకాలు ఈ విద్యా సంవత్సరంలో సరఫరా చేశామన్నారు. గత ప్రభుత్వంలో విద్యార్థుల బ్యాగులు, పుస్తకాలపైన బొమ్మలు వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా కుటుంబంలో ఎంత మంది చదువుకుంటుంటే వారందరికీ నగదు జమ చేశామని అన్నారు. సాంకేతిక కారణాల వల్ల ఎవరికైనా పథకం అమలు కాకపోయినా వారికి కూడా నగదు అందే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మక్కెనవారిపాలెం పాఠశాలకు ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల్లో అసంపూర్తిగా ఉన్న భవనాలు వెంటనే పూర్తి చేయడంతో పాటు విద్యార్థులకు అవసరమైతే నూతన భవనాల నిర్మాణం కూడా చేపడతామని హామీ ఇచ్చారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామన్నారు. మేజర్, మైనర్ కాలువల పూడికతీత పనులు చేశామన్నారు. కాల్వల్లో పూడికతీత పనులకు ఇంకా అవసరమైతే తన సొంత మిషన్లు పంపి పని చేయిస్తానని అన్నారు. త్వరలోనే రైతులకు రూ.20వేల ఆర్థిక భరోసా అందించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నియోజవర్గ పరిధిలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విద్యను అభ్యసిస్తున్న 10వేల మంది విద్యార్థులకు ఈ ఏడాది చివరి నాటికి సిఎస్ఆర్ నిధులతో సైకిళ్లను ఉచితంగా అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంతమాగులూరు ఎఎంసి చైర్మన్ తేలప్రోలు రమేష్, మాజీ ఎంపిపి సన్నెబోయిన ఏడుకొండలు, మాజీ జెడ్పిటిసి తేళ్ల శ్రీనివాసరావు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు సన్నెబోయిన గురు యాదవ్, తహశీల్దారు కె రవిబాబు, ఎంపిడిఒ జ్యోతిర్మయి, ఎంఈఓ వి కోటేశ్వరరావు, నాయకులు చేవూరి వాసురెడ్డి, ధూపాటి ఏసోబు, పసుపులేటి కోటేశ్వరరావు, ఏ దేవ, డి గాలెయ్య, మక్కెన జగదీష్, నక్కా వెంకటేశ్వర్లు, హుక్కు, కాలేషా గారి బుజ్జి, విద్యుత్ ఏఇ దీపక్ రెడ్డి పాల్గొన్నారు.



సైకిళ్లు పంపిణీ చేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

దర్శనీయ ప్రాంతాలకు ఆర్టీసీ సేవలు

ప్రజాశక్తి - బాపట్ల



సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

బాపట్ల నుండి దర్శనీయ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని శాసన సభ్యులు వేగేసేన నరేంద్ర వర్మ రవాణా శాఖ మంత్రి రాంప్రసాదరెడ్డిని కోరారు. స్థానిక కొత్త బస్టాండు ఆవరణలో శుక్రవారం జరిగిన ఆర్టీసీ అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన మంత్రితో కలిసి పాల్గొని మాట్లాడారు. పర్యాటక కేంద్రమైన సూర్యులంక బీచ్‌కు ప్రతి శని, ఆది వారంలలో పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తున్నందున పర్యాటకుల సౌకర్యం కోసం పట్టణం నుండి సూర్యలంకకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. బాపట్ల డిపోలో టాయిలెట్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. బస్ డిపో అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. డిపోకు ఎలక్ట్రిక్ బస్సులు సమకూర్చాలని కోరారు. జిల్లా కేంద్రంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ మంజూరు చేయాలని అన్నారు. డిపోలో ఉత్తమ సేవలు అందించిన ఏడుగురు సిబ్బందికి మంత్రి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివసాంబి రెడ్డి, డిఆర్‌ఒ జి గంగాధర్ గౌడ్, తహశీల్దారు సలీమా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, ఎపిఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేంద్రప్రసాద్, ఆర్‌టిఒ డి సామ్రాజ్యం, డిపో మేనేజర్ పి శ్రీమన్నారాయణ, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

వెంకటసుబ్బయ్య ఆశయాలు కొనసాగిస్తాం

ప్రజాశక్తి - వేమూరు



స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం నాయకులు వెంకట సుబ్బయ్య స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పనిచేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి కృష్ణమోహన్ అన్నారు. వెంకటసుబ్బయ్య 23వ వర్ధంతి సందర్భంగా ఆయన స్వగ్రామమైన ఆముదారులంకలో సంతాప సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ వెంకటసుబ్బయ్య లంక గ్రామాల్లోని జమీందారీ భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించారని, ఆ పోరాటాలు ఫలితంగానే లంక గ్రామాల్లో భూ పంపిణీ జరిగిందన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే వారని అన్నారు. తొలుత సిపిఎం సీనియర్ సభ్యులు జలా చంద్రుడు, మమ్మినేని నాగేశ్వరరావు, మండవ బలరామయ్య తదితరులు వెంకట సుబ్బయ్య, చిట్టెమ్మ చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం కొల్లూరు కార్యదర్శి వేములపల్లి వెంకటరామయ్య, బి సుబ్బారావు, భట్టిప్రోలు నాయకులు జి సుధాకర్, ఎం సత్యనారాయణ, పి మనోజ్, డి సత్యనారాయణ, మండవ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు టి కృష్ణమోహన్

స్మార్ట్ మీటర్లు తిరస్కరించండి

ప్రజాశక్తి - బట్టిప్రోలు

అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో పోస్టర్లను శుక్రవారం ఆవిష్క రించారు .ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లు తమ ఇళ్లకు బిగించకుండా ప్రజలు తిరస్కరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి కృష్ణమోహన్ పిలుపు నిచ్చారు. సిపిఎం సమావేశం భట్టు నాగ మల్లేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టి కృష్ణమోహన్ మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రతిపక్షంలో ఉన్నపుడు స్మార్ట్ మీటర్లు వద్దని, వాటిని పగలగొట్టండని చెప్పి కోర్టులో కేసులు వేసిన టీడీపీ నేతలు ఇప్పుడు అధికారానికి వచ్చిన తర్వాత మాట మార్చి ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి అనేక రూపాల్లో విద్యుత్ చార్జీలు పెంచుతున్నారని అన్నా రు. పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దుచే యాలని కోరారు. ప్రజలు వినియోగిం చిన విద్యుత్‌కు బిల్లులు చెల్లిస్తున్నారని అన్నారు. విద్యుత్ సంస్థ తాము బిగించిన మీటర్ల రీడింగు తమ సిబ్బంది ద్వారా తీయిస్తూ బిల్లులు వసూలు చేస్తోంధని అన్నారు. ఎటువంటి ఆటంకాలు లేకుండా జరుగుతున్న ప్రక్రియ కాకుండా అదానీ ప్రయోజనాలకు అను గుణంగా రాష్ట్రంలోని టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అగ్రహ వ్యక్తం చేశారు. పనిచేస్తున్న మీటర్లను తొలగించి అదాని ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను పరిశ్రమలకు, వాణిజ్య సముదాయాలకు, చిరు వ్యాపారులకు బిగించారని, ఇప్పుడు అపార్టుమెంట్లకు, ప్రజల ఇళ్లకు బిగించడానికి సిద్ధపడ్డారని అన్నారు. కావున ప్రజలు మీద అదనపు భారాలు వేసే విద్యుత్ స్మార్ట్ మీటర్లును తిప్పికోటాలని అన్నారు. దీనికి కోసం పట్టణంలో దశలు వారి పోరాటం చేస్తామని చెప్పారు. సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు వేములపల్లి వెంకటరామయ్య, మురుగుడు సత్యనారాయణ, పప్పుల అహరోను, గోపాల స్వామి, శ్రీనివాసరావు, ఏప్రాయం, మోషే, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

దుద్దుకూరులో నేత్రదానం

ప్రజాశక్తి - ఇంకొల్లు



పీరం ఇస్సాకు (65)

మండలంలోని దుద్దుకూరులో పీరం ఇస్సాకు (65) అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులు ఆయన కళ్ళను దానం చేశారు. గుంటూరు శంకర్ నేత్రాలయ వైద్యులు ఆయన కార్నియ శుక్రవారం సేకరించారు. కుటుంబ సభ్యులు ప్రియాంక, వీరాంజనేయులు, రోజాను రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బలగం కోటేశ్వరరావు, అలవల రాఘవరెడ్డి అభినందించారు.

ప్రజాశక్తి
5
శనివారం 26 జులై 2025



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్అన్సారియా

కెపిఐపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలి

కలెక్టర్ తమీమ్అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రభుత్వం నిర్దేశించిన కె.పి.ఐ (కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్)పై జిల్లాస్థాయి అధికారులు నిరంతరం సమగ్రంగా పర్యవేక్షణ ఉంచాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఆయా అంశాలలో పురోగతిని తాను కూడా ప్రతివారం సమీక్షిస్తానన్నారు. కె.పి.ఐ. లక్ష్యాలు - పురోగతిపై అవగాహన కల్పించేందుకు శుక్రవారం ప్రకాశం భవనంలో అన్ని శాఖల ఉన్నతాధికారులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుస్థిరాభివద్ధి లక్ష్యాలలో భాగంగా రాష్ట్రం కూడా అన్ని విధాలుగా అభివద్ధి చెందేందుకు స్వర్ణాంధ్ర - 2047 పేరుతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దష్టి పెట్టినట్లు తెలిపారు. ఇందుకు ప్రధానంగా దష్టి సారించాల్సిన అంశాలను గుర్తించి వీటిలో పురోగతి కోసం కె.పి.ఐ లను ప్రభుత్వం ఎంచుకున్నట్లు వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరం నుంచే వీటి కోసం లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించిందని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో సంయుక్త .ఆర్. గోపాలకష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి.బి.చిన ఓబులేసు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని

నేడు ఒంగోలులో నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు పూర్తయి రెండు నెలలు గడిచినా రెండు నెలలుగా జీతం రాక ఉపాధ్యాయులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ హై, ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయుల క్యాడర్ స్ట్రెంత్, పొజిషన్ ఐడీలు ఇంకా విడుదల కాలేదని, దీని వల్ల వేతనాల చెల్లింపులు జరగలేదన్నారు. కాగా బదిలీ కౌన్సిలింగ్ ద్వారా బదిలీ అయిన ఉపాధ్యాయులను ఇప్పటివరకు రిలీవ్ చేయకపోవడంతో వారు పాత స్కూల్‌లలోనే కొనసాగుతున్నారని, వెంటనే రిలీవ్ చేసి కొత్త స్కూల్‌లకు రిపోర్ట్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న సుమారు 600 ఎస్జిటీ పోస్టులను తాత్కాలికంగా అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లతో భర్తీ చేసి, బడుగు బలహీన వర్గాల పిల్లలకు విద్యా ప్రమాణాలు కాపాడాలని కోరారు. ఉపాధ్యాయులపై బోధేతర కార్యక్రమాల భారాన్ని తగ్గించకపోవడం వల్ల వారు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని, ఉపాధ్యాయులకు రావలసిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న శనివారం సాయంత్రం 4:30 గంటలకు ఒంగోలు డీఈవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు అందరూ ఈ ధర్నాలో పాల్గొని తమ సమస్యలను తెలియజేయాలని కోరారు.

బిటెక్ అడ్మిషన్స్‌లో 'పేస్' ప్రభంజనం

కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్

ప్రజాశక్తి-టంగుటూరు



శ్రీధర్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన ఈఏపీ సెట్ కన్వీనర్ కోటా సీట్లు కేటాయింపులో మరోసారి పేస్ ఇంజనీరింగ్ కళాశాల అడ్మిషన్స్‌లో ప్రభంజనం సష్టించిందని కళాశాల సెక్రెటరీ అండ్ కరెస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ తెలిపారు. 2025లో ఈ ఏపీ సెట్‌లో పేస్ కాలేజ్‌ని ఆప్షన్‌గా ఎంచుకున్న విద్యార్థులకు, తల్లిదండ్రులకి కృతజ్ఞతలు తెలియజేశారు. తల్లిదండ్రులు మా కళాశాల మీద పెట్టుకున్న నమ్మకాన్ని ఎప్పటిలాగే నిల బెట్టుకుంటామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్య శిక్షణ తరగతులు మొదటి సంవత్సరం నుంచి ప్రారంభించి అత్యధిక ప్యాకేజీతో ఉద్యోగాలని కల్పిస్తామని తెలిపారు.

మున్సిపాలిటీల్లో ఔట్‌సోర్సింగ్ విధానం వద్దు

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మున్సిపల్ కార్మికుల హక్కులను కొల్లగొట్టే ప్రయత్నాలు మానుకోవాలని, కాంట్రాక్టర్ల బొజ్జ నింపే ఔట్సోర్సింగ్ విధానాన్ని వెంటనే ఆపాలని మున్సిపల్ యూనియన్(సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు ఒంగోలు సిఐటియు ప్రకాశం జిల్లా కార్యాలయంలో జి నరసింహ అధ్యక్షతన జరిగిన మున్సిపల్ యూనియన్ జనరల్ బాడీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వేతనం, ఇతర సమస్యలపై జూలై 12 నుండి ఇంజనీరింగ్ కార్మికులు, 16వ తేదీ నుండి పారిశుద్ధ్య కార్మికులు పదిరోజులు పాటు సమ్మె చేపట్టినట్లు గుర్తు చేశారు. కార్మికుల ఐక్యత ముందు ప్రభుత్వం దిగి వచ్చేలా చేసి వేతనాలు పెంచడం, సంక్షేమ పథకాలకు జీవోలు ఇవ్వడం, సమ్మె కాలపు వేతనం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారని వివరించారు. హామీలు నిలబెట్టుకోకపోతే ఆగస్టు 5 నుండి రిలే నిరాహార దీక్షలు, పరిష్కారం లేకుంటే ఆమరణ నిరాహార దీక్షలు చేపట్టక తప్పదని హెచ్చరించారు. నెల్లూరు నగరపాలక సంస్థ రెండు డివిజన్లలో వర్క్ - ఔట్సోర్సింగ్ విధానాన్ని పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేసేందుకు టెండర్లు



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

పిలవడాన్ని తీవ్రంగా దునుమాడారు. ఈ టెండర్లను రద్దు చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతామని స్పష్టం చేశారు. జిల్లా గౌరవ అధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వాల దాటవేత ధోరణిని తిప్పికొట్టేందుకు అవసరమైతే ఉద్యమం చేపట్టక తప్పదని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు కె. నాగభూషణం, కోశాధికారి జ్యోతి బసు, సిఐటియు నగర కార్యదర్శి, రాష్ట్ర కమిటీ సభ్యులు కె. సామ్రాజ్యం, యు. రత్నకుమారి, కొర్నెపాటి పాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు. సమావేశానికి ఇంజనీరింగ్, పారిశుద్ధ్య కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై సంఘీభావం తెలిపారు.

100 శాతం ట్యాక్స్ వసూలు చేయాలి

- లైఫ్ ట్యాక్స్ వసూలుపై ప్రత్యేక దృష్టి
- ఓవర్‌లోడ్ వాహనాలపై కఠినచర్యలు
- రీజినల్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శివరామప్రసాద్ వెల్లడి

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్

ఉప రవాణా కమిషనర్ కార్యాలయం వివిధ రకాల ట్యాక్స్‌లను 100 శాతం రాబట్టాలని రీజనల్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎం.శివరామప్రసాద్ సూచించారు. శుక్రవారం ఉప రవాణా కమిషనర్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రెవెన్యూ వసూలు 80 శాతం ఉన్నప్పటికీ.. డిటెక్షన్ వసూలు విషయంలో చాలా వెనుకబడి ఉన్నారన్నారు. పూర్తిగా రెవెన్యూ రాబట్టుకునేందుకు ప్రణాళిక సిద్ధపరుచుకోమని సూచించామన్నారు. లైఫ్ ట్యాక్స్ విషయంలో చాలా వెనుకబడి ఉన్నారని, నాన్ పేమెంట్స్ ఎక్కువగా ఉన్నాయని పరిశీలించి ట్యాక్స్ వసూలు 100 శాతం చేయాలన్నారు. జిల్లాలో చీమకుర్తి గ్రానైట్‌కు ప్రసిద్ధి అని, ముఖ్యంగా ఓవర్ లోడ్‌తో వెళుతున్న వాహనాలను గుర్తించాలన్నారు. డిటిసి అధికారులు, సిబ్బంది ఓవర్‌లోడ్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ.. తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. పరిమితికి మించి లోడ్ కలిగిన వాహనాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. లైఫ్ ట్యాక్స్ విషయంలో రూ.మూడు కోట్ల బకాయి ఉందని, ఈ విషయమై డీలర్స్‌తో మాట్లాడి వసూలు ఈ విధంగా ఎందుకు జరుగుతుంది, వాహనాలు లైఫ్ ట్యాక్స్ లేకుండా డీలర్స్ బయటికి



మాట్లాడుతున్న శివరామప్రసాద్

పంపిస్తున్నారో గుర్తించాలన్నారు. లైఫ్ టాక్స్ వసూలుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు నాన్ పేమెంట్స్ వెహికల్స్‌ను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. నాన్ పేమెంట్ వెహికల్స్‌ని గుర్తించి కార్యాలయంలో ఉంచాలన్నారు. ఓవర్ లోడ్ వాహనాల విషయాన్ని సీరియస్‌గా తీసుకొని ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టి కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు వారికిచ్చిన లక్ష్యాలను వంద శాతం సాధించే విధంగా కషి చేయాలని ఆదేశించారు. జిల్లా ప్రజలు రహదారి భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్టు ధరించి ప్రయాణాలను కొనసాగించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో రహదారి ప్రమాదాలను ప్రమాదాలు నియంత్రించాలన్నారు. అందరి సహకారంతో ఉప రవాణా కమిషనర్ కార్యాలయం మరింత అభివద్ధి చెందాలని ఆకాంక్షించారు. సమావేశంలో ఉప రవాణా కమిషనర్ ఆర్.సుశీల, మార్కాపురం ఆర్టీవో వై.శ్రీచందన, మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్లు కిరణ్ ప్రభాకర్, సురేంద్రప్రసాద్, రామచంద్రరావు, సహాయ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్లు జయప్రకాష్, ధర్మేంద్ర, భానుప్రకాష్ పాల్గొన్నారు.

మాతృ మరణాల నివారణకు కృషి

డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



మాట్లాడుతున్న డిఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు

జిల్లాలో మాతృ మరణాల నివారణకు కృషి చేయాలని వైద్యాధికారులను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి ఛాంబర్‌లో శుక్రవారం ఆయన అధ్యక్షతన మాతృమరణాలపై సబ్ కమిటీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ జిల్లాలో మాతృమరణాలు జరగకుండా చూడాలని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బందిని ఆదేశించారు. సకాలంలో ప్రమాద సంకేతాలు ఉన్న గర్భిణులను నమోదు చేసి.. వారికీ వైద్య సేవలు అందించాలన్నారు. అన్ని వివరాలను ఆర్సిహెచ్ యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రమాద సంకేతాలు ఉన్న గర్భిణులను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి వారి బర్త్ ప్లాన్‌ను తయారు చేయాలన్నారు. ప్రోటోకాల్ ప్రకారం వారికి వైద్యాధికారి పర్యవేక్షణలో సేవలు అందించాలన్నారు. వారిని ఆశ, ఏఎన్ఎంలు సమీపంలోని ఏరియా ఆసుపత్రికి, సర్వజన ఆసుపత్రికి లేదా ఎం.సి.హెచ్ ఆసుపత్రికి గానీ సకాలంలో 108 వాహనంలో తరలించాలన్నారు. గర్భిణులను ప్రతి నెలా 10న జరిగే ప్రధానమంత్రి మాతృ వందన యోజన కార్యక్రమానికి తీసుకొచ్చి.. అవసరమైన వైద్య పరీక్షలు చేయించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సంధ్యారాణి, డిసిహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాసనాయక్, డాక్టర్ సూరిబాబు, డాక్టర్ అనంతకుమార్, డాక్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

వ్యవసాయ డ్రోన్‌లకు భారీ సబ్సిడీ

డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ లబ్ధిదారులు భారీ సబ్సిడీతో వ్యవసాయక డ్రోన్‌లు పొందవచ్చని డిఆర్‌డిఎ-వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ టి నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం నాడు స్థానిక వెలుగు శిక్షణకేంద్రం లో జరిగిన నాలుగు జిల్లాల నమో దీదీ శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో పురుగుమందుల వాడకం తగ్గించి, ప్రజల ఆరోగ్యం కాపాడటంతో పాటు ఉత్పాదకతను పెంచుకునేందుకు వ్యవసాయంలో డ్రోన్‌లు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరం ఈ పథకం ద్వారా లబ్ధి పొందినవారు ఏటా రూ.లక్ష ఆదాయం పొందటంతో పాటు సమయం ఆదాచేసినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో డిపిఎం (ఎల్ హెచ్)డి దానం, ఎపిఎం (ఫామ్) జె.నారాయణరావు పాల్గొన్నారు.

'ఉచిత బస్సు' అమలులో భాగంగా

బస్సుల నిర్వహణపై సమీక్ష

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం అమలులో భాగంగా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల నిర్వహణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా ప్రజా రవాణాధికారి జి సత్యనారాయణ సూచించారు. శుక్రవారం నాడు ఒంగోలు డీపీటిఓ కార్యాలయంలో ప్రకాశం జిల్లా పరిధిలోని ఐదు డిపోల డిపో మేనేజర్లు, ట్రాఫిక్ మరియు గ్యారేజీ ఇన్‌చార్జ్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అందుబాటులో ఉన్న 246 పల్లెవెలుగు బస్సులు, 74 ఎక్స్‌ప్రెస్ బస్సులు, 4 అల్ట్రా పల్లె వెలుగు బస్సుల నిర్వహణలో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. రూట్ల వారీగా ప్రయాణీకుల అవసరాలను విశ్లేషించి, బస్సులు సమయానికి అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. అలాగే అద్దె బస్సుల యజమానులతో కూడిన మరో సమావేశం నిర్వహించి, బస్సుల నిర్వహణ సమస్యలపై చర్చించి అవసరమైన సూచనలు ఇచ్చారు. ఉచిత బస్సు సౌకర్యం నిరంతరంగా మరింత సౌలభ్యంగా అందుబాటులో ఉండేలా ప్రతీ చిన్న అంశంపై దష్టి పెట్టాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిధిలోని డిపో మేనేజర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి నాయకులు

'కూటమి' ప్రభుత్వ విధానాలతో

విద్యార్థుల చదువుకు విఘాతం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కూటమి ప్రభుత్వం విద్యార్థుల చదువులకు విఘాతం కలిగిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. శుక్రవారం నాడు వైయస్సార్సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ ప్రసాద్, ఇంటిలెక్చ్యువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రొండా అంజిరెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు పల్నాటి రవీంద్రరెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల హామీలు పక్కనపెట్టి చంద్రబాబు ప్రభుత్వం విద్యార్థుల చదువులకు విఘాతం కలిగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసీపీ హయాంలో జగనన్న విద్యాదీవెన, వసతి దీవెనలతో లక్షల విద్యార్థులకు నిరంతర ఆర్థిక సాయం అందిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం అడుగడుగునా ఆటంకాలు పెడుతోందని విమర్శించారు. ఏడాదిగా 'ఇస్తాం' అంటూ ఊరించి, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను సకాలంలో ఇవ్వకుండా విద్యార్థుల చదువులను అర్ధాంతరంగా ఆపేస్తున్నారని తెలిపారు. వెంటనే ఫీజు బకాయిలు పూర్తిగా విడుదల చేసి, విద్యార్థుల చదువులు ఆగకుండా చూడాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ రాజేష్ బాబు

'సూర్య ఘర్'ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - వేటపాలెం

పిఎం సూర్య ఘర్ సోలార్ సబ్సిడీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ మేడబలిమి రాజేష్ బాబు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో సూర్య ఘర్ సోలార్ సబ్సిడీ స్కీంపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఏడు శాతం వడ్డీతో 90 శాతం వరకు బ్యాంకు లోన్ సదుపాయం ఉందన్నారు. ఎడిఈ పెరుగు శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోటి ఇళ్లపై సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. ఉచిత విద్యుత్ పథకం ద్వారా 3యూనిట్ల వరకు విద్యుత్ వాడకానికి అనుమతి ఉందన్నారు. అదనపు విద్యుత్తు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ అన్నం శ్రీనివాసరావు, ఎపిఎం కాటి అంజిబాబు, ఎఇలు పలుకుల భాస్కరరావు, పిల్లాడిశెట్టి వేదవాస్, పంచాయితీ కార్యదర్శి బాలిగ సురేంద్ర, టిడిపి నాయకులు నాసిక వీరభద్రయ్య, జాగాబత్తుని పోతురాజు, షేక్ లాల్ అహ్మద్, దోగుపర్తి బాలకృష్ణ, విఒఎలు పాల్గొన్నారు.

నేటి నుంచి టైప్ రైటింగ్ పరీక్షలు

ప్రజాశక్తి - రేపల్లె

మంగళగిరిలోని ఎపి స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తం గా 13 జిల్లాల్లోని 36 కేంద్రాల్లో టైప్ రైటింగ్ పరీక్షలు జూలై 26, 27 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఎపి టైప్ రైటింగ్ అండ్ షార్ట్ హ్యాండ్ ఇనిస్ట్యూట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సివి మోహనరావు తెలిపారు. ఇంగ్లీషు, తెలుగు, హిందీ భాషల్లో లోయర్ గ్రేడ్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు, ఇంగ్లీష్ జూనియర్ గ్రేడ్ పరీక్షలు, ఇంగ్లీష్, తెలుగు హైస్పీడ్ పరీక్షలు నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. గుంటూరు జిల్లాలోని రేపల్లె, తెనాలి, గుంటూరు, నరసరావుపేట కేంద్రంలో పరీక్షలు జరుగుతా యిన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 5వేల మంది, రేపల్లె కేంద్రంలో 54 మంది హాజరవుతారని తెలిపారు. పరీక్షల ప్రకటన ఆలస్యమైనందున కేవలం ఒకరోజు అనగా మార్చి 27న ఆదివారం మాత్రమే రేపల్లె కేంద్రంలో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. టైప్ రైటింగ్ పరీక్షల నిర్వహణ వివరాలను స్థానిక టైప్ ఇనిస్టిట్యూట్స్ ప్రిన్సిపాల్‌ను, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్సను సంప్రదించి తెలుసుకోవాలని అన్నారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షలకు హాజరు కావాలని కోరారు.

27న ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని పూనూరు జికె అండ్ ఎంకె జెడ్‌పి ఉన్నత పాఠశాల 1980-81లో 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో పాఠశాల ఏర్పడి 75ఏళ్ల డైమండ్ జూబ్లీ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం ఈనెల 27న ఆదివారం నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు బోయిన వెంకటరావు తెలిపారు. స్థానిక శాసన సభ్యులు ఏలూరు సాంబశివరావు సహకారంతో కాటూరి మెడికల్ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు తెలిపారు. వైద్య శిబిరంలో కార్డియాలజీ, గైనకాలజీ, ఇఎన్‌టి, ఆర్థోపెడిక్, చర్మవ్యాధులు, అన్ని జనరల్ డాక్టర్లు వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. అనుభవజ్ఞులైన వైద్యులచే నిర్వహిస్తున్న వైద్య శిభిరంకు పరిసర గ్రామాల ప్రజలు హాజరై వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. వ్యాధులను బట్టి అవసరమైన పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు. జబ్బుకు తగిన మందులు కూడా ఉచితంగానే అందజేస్తారని తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్లో డైమండ్ జూబ్లీ ఉత్సవాల నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థులు గన్నమనేని శివలింగారావు, గన్నమనేని కృష్ణవేణి తెలిపారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకరిస్తున్నామని తెలిపారు. ప్రజలు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వం అందించే సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఆర్థిక భరోసా



సిఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఆనందబాబు

ప్రజాశక్తి,- అమృతలూరు

మండలంలోని అమృతలూరు గ్రామానికి చెందిన నలుకుర్తి సల్మాన్ ఖాన్ అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు సిఫార్సుతో సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3.50లక్షలకు ఎల్ఒసి శుక్రవారం అందజేశారు.

యద్దనపూడి : పేదలకు సీఎంఆర్ఎఫ్‌తో ఆరోగ్య, ఆర్థిక బరోసా ఇస్తున్నట్లు టిడిపి మండల నాయకులు కనపర్తి నాగేశ్వరరావు అన్నారు. యద్దనపూడిలోని తెలుగుదేశం కార్యాలయం వద్ద సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన శుక్రవారం పంపిణీ చేశారు. వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతూ చికిత్స పొందిన పలువురికి శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు సిఫార్సు మేరకు మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కులు లబ్ధి దారులకు అందజేశారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏడాది పాలనలో పేదలు ఏదో ఒక కారణంతో అనారోగ్యం బారిన పడి హాస్పటల్‌లో చికిత్స పొంది వైద్య ఖర్చులు ఎక్కువ మొత్తంలో ఖర్చు అయినప్పుడు ఆ ఖర్చు మొత్తంలో ప్రభుత్వం నుండి సిఎంఆర్ఎఫ్ రూపంలో తిరిగి పొందటం, పేదలను ఆదుకోవడం, పేదవారికి ఆర్థిక చేయూత అందించినట్లేనని అన్నారు. యద్దనపూడికి చెందిన షేక్ అమీరున్‌కు రూ.20వేలు, షేక్ మస్తాన్ వలికి రూ.22460, బండారుపల్లి సుబ్బయ్యకు రూ.95వేల విలువైన చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కనపర్తి నాగేశ్వరరావు, సూరిశెట్టి శ్రీనివాసరావు, షేక్ బాజీ, కొండల రాయుడు, సతీష్, రావూరి రాధా, అత్తోటి శ్రీను, కొత్తిపాటి వేణు, ముద్దన శ్రీను పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న టిడిపి నాయకులు కె నాగేశ్వరావు

వేలమూరిపాడులో క్షుద్ర పూజల కలకలం

- భయాందోళనలో గ్రామస్తులు

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని వేలమూరిపాడు గ్రామంలో ఎస్సీ కాలనీ నుండి స్మశానానికి వెళ్లే దారిలో గుర్తు తెలియని దుండగులు క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు గ్రామస్థులను భయాందోళనకు గురి చేశాయి. గురువారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కారులో వచ్చి క్షుద్ర పూజలు చేసి ఉంటారని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. పోలీసు సైరన్‌తో అక్కడికి చేరుకున్నట్లు గ్రామస్తులు చెబతున్నారు. పోలీసులు వాహనంగా భావించి పట్టించుకోలేదని, ఉదయాన్నే చూస్తే క్షుద్ర పూజలు చేసినట్లు గ్రామస్తులు గుర్తించారు. స్మశానానికి వెళ్లే దారిలో ముగ్గు వేసి, నిమ్మకాయలు, పసుపు, కుంకుమ, చెప్పులు, బట్టలు వంటి వస్తువులతో క్షుద్ర పూజలు చేసినట్లు ఆనవాళ్లు దర్శనమిచ్చాయి. ఈ ఘటనపై గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి విచారిస్తున్నారు.



స్మశాన వాటిక సమీపంలో ముగ్గుతో వేసిన బొమ్మ

ఆంగ్ల భాషపైనా పట్టు సాధించాలి..

ప్రజాశక్తి - బాపట్ల

మాతృభాషతో పాటు ఆంగ్లభాషపై పట్టు సాధించి నైతిక విలువలు, జీవన నైపుణ్యాలు పెంచుకోవాలని బెంగళూరుకు చెందిన ఉన్నతి స్వచ్ఛంద సంస్థ ట్రైన్ చేంజ్ మేకర్ కె రామకృష్ణారెడ్డి అన్నారు. బాపట్ల ఫార్మసీ కళాశాల్లో యూనెక్స్ ఆధ్వర్యంలో నెలరోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. అభ్యర్థులు ఉద్యోగ అవకాశాల కోసం హాజరయ్యే ఇంటర్వ్యూలకు అవసరమైన ఆంగ్ల భాషా పరిజ్ఞానం, డిబేట్, పబ్లిక్ స్పీకింగ్, పర్సనాలిటీ డెవలప్మెంట్, జనరల్ సైకాలజీకి సంబంధించిన అనేక అంశాలు విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ గోపాల కృష్ణమూర్తి మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రతి విద్యార్థి స్కిల్స్ నేర్చుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమానికి కో ఆర్డినేటర్‌గా పి శ్రీదేవి, బాపట్ల ఎడ్యుకేషన సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాస రావు, కార్యదర్శి మానం నాగేశ్వరరావు పాల్గొన్నారు.



విద్యార్థులతో సెమినార్ నిర్వాహకులు

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి - చెరుకుపల్లి

మండలంలోని కావూరులో ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిళ్లు శుక్రవారం కాలి బూడిదైంది. గ్రామం పరిధిలోని మురుగు కాలువ కట్టపై యానాదులు నివసిస్తున్నారు. వీరిలో జయంపు శివయ్యకు చెందిన పూరిళ్లు ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇళ్లు పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చినప్పటికీ అప్పటికే ఇళ్లు పూర్తిగా కాలిపోంది. ఇంట్లోని సామాన్లు, పత్రాలు కాలిపోయాయి.



మంటల్లో కాలిపోతున్న పూరి గుడిసె



మాట్లాడుతున్న సైన్స్ ఆఫీసర్ మహమ్మద్ సాదిక్

సైన్స్ ప్రయోగాలతో శాస్త్ర విజ్ఞానం

ప్రజాశక్తి - వేటపాలెం

తక్కువ వ్యయంతో సైన్స్ ప్రయోగాలు ఎలా చేయాలో విద్యార్థులకు తెలియజేయాలని సైన్స్ జిల్లా ఆఫీసర్ మహమ్మద్ సాదిక్ అన్నారు. స్థానిక జెడ్‌పి బాలికోతన్న పాఠశాలను ఆయన ప్రార్థన సమయంలో తనిఖీ చేశారు. 'స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ వెంకట మురళి జిల్లాలో ప్లాస్టిక్ వినియోగం నిషేధించారని తెలిపారు. కనుక పర్యావరణ సంక్షోభానికి కారణమైన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిలిపివేయాలని అన్నారు. గుడ్డ సంచుల వాడకానికి సూచనలు ఇచ్చారు. విద్యార్థులు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని అన్నారు. సైన్స్ ప్రయోగ పరికరాల వినియోగంపై ఉపాధ్యాయులతో చర్చించారు. సైన్సు, గణిత ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. సైన్స్ ల్యాబ్ పరిశీలించారు. సైన్స్ ల్యాబ్‌ను ఉపయోగిస్తూ విద్యార్థులచే ప్రయోగాలు చేయించాలని అన్నారు. 2025 - 26 సైన్స్ స్ఫెయిర్ నామినేషన్‌పై ఉపాధ్యాయులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చారు. సైన్స్ సెమినార్, సైన్స్ ఎగ్జిబిషన్ గురించి చర్చించారు. ఇటీవల తల్లికి వందనంలో భాగంగా పిల్లల విద్యలో తల్లి పాత్ర అనే అంశంపై నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దేవరకొండ సరోజిని, స్టాఫ్ సెక్రెటరీ కె సోమశేఖర్ పాల్గొన్నారు.

2694 క్వింటాళ్ల నల్లబర్లీ పొగాకు కొనుగోలు

ప్రజాశక్తి - పంగులూరు



తహశీల్దారు పి సింగారావు

పంగులూరు పొగాకు కొనుగోలు కేంద్రం ద్వారా ఇప్పటివరకు 2,694.21 క్వింటాళ్ల నల్లబర్లి పొగాకు కొనుగోలు చేసినట్లు తహశీల్దారు పి సింగారావు శుక్రవారం తెలిపారు. పొగాకు కొనుగోలు కేంద్రం గత నెల 30న స్థానిక మార్కెట్ యార్డులో మంత్రులు కొలుసు పార్థసారథి, గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. ఈనెల 21వరకు మార్కెట్ యార్డులోనే కొనుగోలు చేశారు. అక్కడున్న రెండు గోడౌన్లు పొగాకు చెక్కులతో నిండిపోవడంతో 22నుండి మండలంలోని తూర్పు కొప్పెరపాడు గ్రామంలోని పిఎసిఎస్‌కు చెందిన గోడౌన్ దగ్గరకు కొనుగోలు మార్చారు. పంగులూరు యార్డులో 2,094.71 క్వింటాళ్లు కొనుగోలు చేయగా తూర్పు కొప్పెరపాడులో గత నాలుగు రోజుల నుండి 599.50 క్వింటాళ్లు కొన్నట్లు తెలిపారు. అక్కడ కూడా గోడౌను నిండిపోవడంతో శుక్రవారం నుండి అద్దంకి మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పంగులూరు, తూర్పు కొప్పెరపాడు గ్రామాల గోడౌన్లలో 2,694.21 క్వింటాళ్లు పొగాకు నిల్వ చేసినట్లు తెలిపారు. ఇక నుండి పంగులూరు మండలంలోని నల్లబర్లి పొగాకు రైతులు తమ పొగాకును అద్దంకి మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంకు తీసుకురావాలని కోరారు. ఇక్కడ గోడౌనుకు 6వేల చెక్కులు నిలువచేసే సామర్థ్యం ఉందని తెలిపారు. అందువలన రైతులు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. రైతులు తమ పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా అమ్ముకోవాలని సూచించారు.

మద్యం తాగి వాహనం నడిపిన ముగ్గురికి జరిమానా

ప్రజాశక్తి - అద్దంకి

స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురు వ్యక్తులను సిఐ సుబ్బరాజు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పర్చారు. తమిళనాడుకు చెందిన లారీ డ్రైవర్‌కు రూ.10 వేలు, మరో ఇద్దరు వ్యక్తులకు రూ.10వేల చొప్పున ఎజెఎఫ్‌ఎంసి జడ్జి బి అఖిల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

యువకుల ప్రాణాలు కాపాడిన పోలీసులు

- స్పందించిన ఎస్ఐ చంద్రశేఖర్, స్విమర్లు
- ఎమ్మెల్యే చొరవతో ప్రయాణికులకు భద్రత
- సిబ్బందిని అభినందించిన ఎస్పీ తుషార్ డూడి



యువకులతో మాట్లాడుతున్న ఎస్ఐ చంద్రశేఖర్

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని వాడరేవు సముద్ర తీరంలో శుక్రవారం పెను విషాదం తృటిలో తప్పింది. తీరంలో మునుగుతూ అలల అక్కడికి గురై ముగ్గురు యువకులు సముద్రంలోకి కొట్టుకెళ్లారు. వెంటనే స్పందించిన పోలీసులు, గజ ఈతగాళ్లు ముగ్గురు యువకులను కాపాడారు. డ్రోన్ కెమెరాతో ప్రమాదాన్ని గుర్తించిన ఎస్ఐ చంద్రశేఖర్ అత్యంత వేగంగా స్పందించారు. పోలీస్ సిబ్బందిని, గజ ఈతగాళ్లను అప్రమత్తం చేశారు. పోలీసులు, ఈతగాళ్లు ప్రాణాలను లెక్కచేయకుండా సముద్రంలోకి దూకి యువకులను కాపాడారు. ఈ ఘటనపై శాసన సభ్యులు కొండయ్య, ఎస్పీ తుషార్ డూడి తక్షణం స్పందించిన సిబ్బందిని ప్రశంసించారు. యాత్రికుల భద్రత కోసం అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. మార్టూరు మండలం కోలలపూడి నుంచి అంకాలమ్మ తల్లి కొలుపుల సందర్భంగా వెయ్యి మందిపైగా యాత్రికులు వాడరేవు సముద్ర తీరానికి తరలివచ్చారు. వీరిలో ముగ్గురు యువకులు అధిక లోతుకు వెళ్లి మునుగుతుండగా ఒక్కసారిగా వచ్చిన అలల తాకిడికి ప్రమాదంలో చిక్కుకున్నారు. డ్రోన్ కెమేరా ద్వారా గుర్తించిన రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్ వేగంగా స్పందించారు. ఈ ఘటనలో యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం గ్రామస్తులకు సురక్షితంగా అప్పగించారు. పోలీసులు ప్రదర్శించిన ధైర్య సాహసాలపై యాత్రికులు హర్షం వ్యక్తం చేశారు.

భద్రతా చర్యల్లో రాజీ పడేది లేదు

తీరప్రాంతానికి వచ్చే పర్యటకులకు భద్రతా ఏర్పాట్లలో రాజీ పడే ప్రసక్తే లేదని, పోలీసులు, గజ ఈతగాళ్లను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ పూర్తి ఏర్పాట్లు చేసినట్లు శాసన సభ్యులు కొండయ్య తెలిపారు. డ్రోన్ కెమేరాల నిఘా నీడలో ఎప్పటికప్పుడు యాత్రికులను అప్రమత్తం చేస్తున్నామని అన్నారు. ప్రజల ప్రాణాలు విలువైనవని అన్నారు. యువకుల ప్రాణాలు రక్షించిన పోలీసు సిబ్బంది, గజ ఈతగాళ్లను, ఎస్పీని అభినందించారు.

భద్రత కోసం మెరుగైన చర్యలు

వాడరేవు, రామాపురం బీచ్‌లలో యాత్రికుల రక్షణ కోసం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశామని ఎస్‌పి తుషార్ డూడి పేర్కొన్నారు. ఎక్కువగా పోలీసు సిబ్బంది, గజఈతగాళ్లను నియమించడంతో పాటు డ్రోన్లు, సీసీ కెమెరాలు, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. పోలీసు హెచ్చరికలు పాటించకుండా అధిక లోతులోకి వెళ్లే యాత్రికులు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం సేవించి సముద్రంలోకి దిగిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



యువకులను కాపాడుతున్న పోలీసులు, గజ ఈతగాళ్లు



సైకిళ్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి - బాపట్ల

పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయమని మండలంలోని చెరువు జమ్ములపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బివి కృష్ణారావు అన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థి కమ్మ విద్యాసాగర్ (యుఎస్ఎ) సహకారంతో 59 మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్ళను శుక్రవారం పాఠశాల ఆవరణలో పంపిణీ చేశారు. సైకిళ్ళ దాత విద్యాసాగర్ మాట్లాడుతూ తమ స్నేహితులు పాఠశాల పూర్వ విద్యార్థులు నల్లమోతు శ్రీధర్, కొమ్మినేని శ్రీనివాసరావు సహకారంతో సైకిళ్లను విద్యార్థులకు సమకూర్చినట్లు తెలిపారు. పూర్వ విద్యార్థులు తామ చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బోయిన వెంకటేశ్వరమ్మ, మాజీ సర్పంచ్ బోయిన వెంకయ్య, యార్లగడ్డ అంకమ్మ చౌదరి, పువ్వాడ బసంత్ కుమార్, సుబ్బరామయ్య, బొంగులూరు శ్రీనివాసరావు, రాహుల్, పాఠశాల పిడి బి వీరచంద్ర, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యుత్తు షాకుతో మృతి చెందిన గేదెలు

విద్యుత్ షాక్‌తో గేదెలు మృతి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

పొలం నుంచి ఇంటికి వస్తున్న రెండు గేదెలు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఘటన మార్టూరు సమీపంలోని నాగరాజుపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానిక రైతు సోమల నాగేశ్వరరావుకు చెందిన రూ.2లక్షల విలువైన రెండు గేదెలు నాగరాజుపల్లి గ్రామ సమీపంలో చేతికి అందే ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందడటాన్ని స్థానికులు గమనించి రైతుకు సమాచారం ఇచ్చారు. గ్రామంలో విద్యుత్ సమస్య కారణంగా అప్పటి వరకు రిపేరు చేసిన సిబ్బంది కరెంటు సప్లై ఇచ్చిన కొద్దిసేపటికే చేతికి అందే ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు తగిలి రెండు గేదెలు మృతి చెందాయి. దీంతో రైతు నాగేశ్వరావు తనకు జీవనాధారమైన గేదెలు చనిపోవడంతో విలవిల్లాడారు. విద్యుత్ అధికారులు స్పందించి రైతుకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు దేవాలయ భూముల కౌలు వేలం

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని రామకూరులో గల రామలింగ స్వామి దేవస్థానంకు చెందిన 20.31 ఎకరాల భూమి కౌలు బహిరంగ వేలం రామకూరు పంచాయతీ కార్యాలయంలో శనివారం జరుగుతుందని దేవస్థానం ఇఒ సుబ్బారావు శుక్రవారం తెలిపారు. శుక్రవారం ఉదయం జరగవలసిన వేలం పాట అనివార్య కారణాల వలన శనివారంకు వాయిదా వేసినట్లు తెలిపారు. రామకూరుకు చెందిన సర్వే నెంబర్ 136 లో 12 ఎకరాలు, సర్వే నెంబర్ 109లో 8.31 ఎకరాల మెట్ట భూమి కౌలు వేలం జరుగుతుందని తెలిపారు. దేవాలయానికి గతంలో బాకీ ఉన్నవారు గానీ, లావాదేవీలు ఉన్నవారు పాటలో పాల్గొన రాదని తెలిపారు. పాటలో పాల్గొనే వారు తమ స్థితిగతులను తెలిపి, పాటకు ముందు రూ.5 వేల ధరావత్తు చెల్లించాలని చెప్పారు. హెచ్చు పాటదారుడు డిపాజిట్ కాక హెచ్చు పాట మొత్తం వెంటనే చెల్లించాలని, అలా చెల్లించకపోతే మరల భూముల వేలం జరుపుతామని తెలిపారు. మొదట చెల్లించిన ధరావత్తు అపరాధం కింద దేవస్థానం జమ చేసుకుంటుందని తెలిపారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల ఉత్తర్వులకు లోబడి కౌలు వేలం జరుపుతున్నట్లు చెప్పారు. మిగిలిన షరతులు వేలం పాటకు ముందుగా తెలియజేస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న చీరాల డిఎస్‌పి మహ్మద్ మొయిన్

అంతర్ జిల్లా దొంగలు అరెస్టు

ప్రజాశక్తి - మేదరమెట్ల

వరుస చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న అంతర జిల్లాల దొంగలను అరెస్టు చేసినట్లు డిఎస్‌పి మహ్మద్ మొయిన్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. జూన్ నెలలో వేమూరు పోలీసు స్టేషన్ పరిధిలోని ఇంటి ముందు ఒక మహిళ ముగ్గు వేస్తుండగా ఆమె మెడలో బంగారు చైను లాక్కుని వెళ్లారని తెలిపారు. కోరిశపాడు గ్రామంలోని టిఫన్ హోటల్ దగ్గర ఉన్న మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కుని వెళ్లారని తెలిపారు. రెండు ఘటనలు ఆయా పోలీసు స్టేషన్లలో బాధితుల పిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. విచారణలో గుంటూరు పట్టణం కొరిటపాడుకు చెందిన మేకల హరీష్, గుంటూరు పట్టణం సంజీవ్‌నగర్ నాలుగో లైనుకు చెందిన షేక్ యాసిన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఎస్పీ తుషార్ డూడి ఉత్తర్వుల మేరకు చీరాల డిఎస్‌పి మహ్మద్ మొయిన్ నేతృత్వంలో అద్దంకి రూరల్ సిఐ డి మల్లికార్జునరావు, కోరిసపాడు, మేదరమెట్ల, జె పంగులూరు ఎస్ఐలు వై సురేష్ బాబు, మహమ్మద్ రఫీ, బి వినోద్ బాబు తమ సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందంగా ఏర్పడి చైన్ స్నాచింగ్ చోరీలకు పాల్పడుతున్న ముద్దాయిల ఆచూకీ కోసం గాలించినట్లు తెలిపారు. ఈ క్రమంలో తమ సిబ్బందికి అందిన సమాచారం మేరకు మంగళగిరి ఫ్లైఓవర్ దగ్గరలో ఇద్దరు ముద్దాయిలను అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.4.50లక్షల విలువైన 58 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. ముద్దాయిలను న్యాయస్థానం ముందు హాజరు పర్చినట్లు తెలిపారు. ముద్దాయిలను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి ఉత్తమ ప్రతిభ అవార్డులు అందించనున్నట్లు తెలిపారు.

నేడు ప్రతిభామూర్తులకు సత్కారం

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని బంగ్లా రోడ్డు చిన్ని శాంతయ్య సేవాసదన్‌లో శనివారం సాయంత్రం ప్రతిభ మూర్తులకు సత్కార సభ జరుగుతుందని బాధ్యులు పిసిహెచ్ కోటయ్య తెలిపారు. సభలో కొల్లా భువనేశ్వరి, నటుడు శరత్ బాబు సినీవిశేషాలు గూర్చి ప్రసంగం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో జానపద కళాపీఠం అధ్యక్ష, కార్యదర్శులు ఉబ్బా దేవపాలన, జ్యోతి చంద్రమౌళికి చిరు సత్కారం, రంగస్థల నటుడు పీసపాటి సంస్మరణ అంశాలు ఉన్నాయని తెలిపారు.

దళిత సర్పంచ్‌పై సిఐ దౌర్జన్యం

కారంచేడు స్టేషన్లో సర్పంచి ఠాగూర్ పిర్యాదు

ప్రజాశక్తి - కారంచేడు

తనను ఇంకొల్లు సిఐ వైవి రమణయ్య కారంచేడు పోలీసు స్టేషన్‌కు విచారణ పేరుతో పిలిపించి తనను కొట్టి, పత్రికల్లో రాయలేని విధంగా బూతులు తిట్టారని మండలంలోని దగ్గుబాడు సర్పంచి గేరా రవీంద్రనాథ్ ఠాగూర్ శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈనెల 19న రౌడీ షీటర్లు అందరినీ కౌన్సిలింగ్ పేరుతో పోలీసు స్టేషన్‌కు పిలిపించి అందరి సమక్షంలో తన చొక్కా పట్టుకొని క్రిందకు గుంజి తన ముఖంపై భౌతికంగా దాడి చేశాడని పిర్యాదులో పేర్కొన్నారు. తనను అవమానకరంగా మాట్లాడి తనపై చేయి చేసుకొని తనను ఎన్కౌంటర్ చేస్తానని బెదిరించినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో తనపై అక్రమంగా కొన్ని కేసులు నమోదు చేశారని, దీనిపై ప్రతి శనివారం తాను పోలీసు స్టేషన్లో హాజరవుతున్నానని, కొన్ని సందర్భాల్లో హాజరు కాలేక ముందుగానే స్టేషన్లో అనుమతి తీసుకొని వెళుతున్నానని ఫిర్యాదులో పేర్కొన్నారు. పంచాయతీ సర్పంచ్ అయిన తనను తమ కార్యాలయంలో అంబేద్కర్ బొమ్మ పెట్టానని, సిఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు ఫోటోలు ఎందుకు పెట్టలేదని బెదిరించారని చెప్పారు. ఫోటోలు పెట్టకపోతే తనపై పిడి చట్టం కింద కేసు నమోదు చేసి లోపల వేయిస్తానని, బయటకు రాకుండా చేస్తానని బెదిరించినట్లు తెలిపారు. తనపై అక్రమ కేసులు పెట్టడానికి కొంతమంది వ్యక్తులను సిద్ధం చేశాడని, తన మాట వినకపోతే వారి చేత అనేక కేసులు పెట్టించి బయటికి రాకుండా చేస్తానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే తమ పంచాయితీ కార్యాలయంలో అంబేద్కర్ ఫోటో తోపాటు సిఎం, డిప్యూటి సిఎం, ఎమ్మెల్యే ఫోటోలు ఉన్నాయని చెప్పిన వినకుండా తనపై దాడి చేసి కొట్టాడని చెప్పారు. తనను అవమానించిన సిఐ రమణయ్యపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సిఐ తనపై చేసిన దౌర్జన్యం మొత్తం పోలీసు స్టేషన్ ఆవరణలోని సీసీ కెమెరాల్లో నమోదై ఉందని, పోలీసు ఉన్నతాధికారులు వాటిని పరిశీలించి తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ ఘటనపై జాతీయ మానవ హక్కుల సంఘానికి, డీజీపీకి, ఐజి కూడా ఫిర్యాదు పంపినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్ఐ హర్షవర్ధన్‌రెడ్డి

మద్యం అక్రమార్కులపై చర్యలు

ప్రజాశక్తి - అద్దంకి

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహించిన, బెల్ట్ షాపులను ప్రోత్సహించిన వారిపై చట్టరీత్య కఠిన చర్యలు తీసుకుటామని ఎస్ఐ హర్షవర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. మద్యం అక్రమాలు గమనిస్తే 14405 నెంబరుకు గాని, ఎక్సైజ్ ఎస్ఐ 62812 88914 నెంబరుకు గాని సమాచారం ఇవ్వాలని కోరారు. గతేడాది అక్టోబర్ నుండి 2025 జూన్ వరకు దాడులు చేసి 70 కేసులు నమోదు చేసి 70 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. 153.58 లీటర్ల మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై 10 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలోని ధర్మవరం, వెంకటాపురం గ్రామాల్లో బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి రెండు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.



పుస్తకాలు బహుకరిస్తున్న శ్రీరామ చంద్రమూర్తి

పాఠశాలకు పుస్తకాలు బహూకరణ

ప్రజాశక్తి - అద్దంకి

ముండ్లమూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు రూ.5వేల విలువైన గ్రంథాలయ పుస్తకాలను విద్యావేత్త, విశ్రాంత హెచ్‌ఎం పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి శుక్రవారం అందచేశారు. హెచ్‌ఎం కుందుర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ 'పఠనం అనేది విద్యార్థి జీవితాన్ని ప్రభావితం చేసే శక్తిమంతమైన సాధనం. సైన్స్ ఉపాధ్యాయులు తంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పుస్తకం అనేది జ్ఞానానికి ప్రతీకని అన్నారు. పుస్తకం మంచి స్నేహితుడని అన్నారు. శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల స్వప్నాలకు మౌలిక స్థంభాలు, మంచి పుస్తకాలు మేధోవికాసానికి ఉపయోగ పడతాయని అన్నారు. విద్యార్థులకు మంచి గ్రంథాలయ వనరులు అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ ట్రస్టు పనిచేస్తుందని పేర్కొన్నారు. విశ్రాంత హెచ్‌ఎం పాశం కృష్ణయ్య పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులను ఆదరించాలి

కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

సామాజిక వెనుకబాటులో ఉన్న ఎస్టీలు, విభిన్న ప్రతిభావంతులను ఆదరించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ఎస్టీలు, విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు వినతిపత్రాల ద్వారా కలెక్టర్ కి విన్నవించారు. తన పరిధిలోని వాటికి ఆయన తక్షణమే పరిష్కార మార్గం చూపారు. నిరాదరణకు గురైన వారి పట్ల బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ చెప్పారు. సమాజంలో అత్యంత వెనుకబడిన వర్గాలుగా ఉన్న ఎస్టీల హక్కులు సంరక్షించాలన్నారు. పి-4 అమలులో బంగారు కుటుంబాలను మార్గదర్శిలకు అనుసంధానించాలన్నారు. నీడ్ బేస్డ్ ప్రాథమిక సర్వే పక్కాగా పూర్తి చేసి అర్హులైన వారి పేర్లు మాత్రమే ఉంచాలన్నారు. మార్గదర్శిల సహాయం నేరుగా బంగారు కుటుంబాలకు చేరాలన్నారు. బంగారు కుటుంబాల ఆర్థిక అభివద్ధికి చేయూతను అందించాలన్నారు. సహాయం ఎలా అందించాలో మార్గదర్శిలకు అవగాహన కల్పించాలన్నారు. ఒకటో తేదీన ప్రారంభమయ్యే పింఛన్ పంపిణీ ప్రక్రియ సజావుగా సాగడానికి నగదు పంపిణీ సిబ్బందిని మ్యాపింగ్ చేయాలన్నారు. సచివాలయాల సిబ్బంది బదిలీల ప్రక్రియ ముగియగానే డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లకు పింఛన్ పంపిణీ బాధ్యత కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి సంయుక్త కలెక్టర్ జి గంగాధర్ గౌడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించాలి

స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. స్వాతంత్ర దినోత్సవం ఏర్పాట్లపై ముందస్తు సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో జరిగింది. స్వాతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి అధికారులు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ చెప్పారు. పోలీస్ కవాతు మైదానాన్ని ముస్తాబు చేయాలని, జిల్లా ప్రగతి చాటి చెప్పాలా ఉండాలన్నారు. వైద్య శిబిరాలు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంచార్జ్ సంయుక్త కలెక్టర్, డిఆర్ఓ జి గంగాధర్ గౌడ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తాగునీరు కలుషితం కాకుండా చర్యలు

వర్షాకాలంలో తాగునీరు కలుషితం గాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. ఖచ్చితంగా క్లోరినేషన్ నిరంతరం జరగాలన్నారు. ఎప్పటికప్పుడు తాగునీటి పరీక్షలు చేయాలన్నారు. గహాల మధ్య నీటి నిల్వలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి సరఫరాలో పరిశుభ్రత పాటించాలన్నారు. సమావేశంలో జిల్లా ఇన్చార్జి సంయుక్త కలెక్టర్, డిఆర్ఓ జి గంగాధర్ గౌడ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత పిల్లలదే..

వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత పిల్లలపై ఉందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. వద్ధుల పోషణ, సంరక్షణ చట్టం అమలు తీరుపై అవగాహన కార్యక్రమం శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో జరిగింది. వద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను చూడడం సామాజిక బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. వద్ధాప్యంలో ఉన్న వారిని చూడకుండా పిల్లలు వదిలేస్తే తక్షణమే ఆర్డిఓలకు ఫిర్యాదు చేయాలన్నారు. వద్ధుల హక్కుల పరిరక్షణకు అధికారులు కషి చేయాలన్నారు. తల్లిదండ్రుల చట్టాన్ని పకడ్బందీగా ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. వద్ధులను చూడకుండా వదిలేస్తే నేరంగా పరిగణించాల్సి ఉంటుందన్నారు. చూడకుండా దూరంగా ఉంచితే పోషణ ఖర్చు కింద వారికి నెలకు రూ.10 వేలు చొప్పున ఇవ్వాలన్నారు. డబ్బులు ఇవ్వకుండా నిలిపివేస్తే మూడు నెలలు జైలు శిక్ష ఉంటుందన్నారు. పిల్లలకి సంక్రమించే ఆస్తులన్నీ తిరిగి తల్లిదండ్రులకే ఇచ్చే అధికారాలు ఆర్డీవోలు, కలెక్టర్ కు ఉంటుందన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వద్ధ మిత్ర కమిటీలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సచివాలయాల స్థాయిలో విస్తత ప్రచారం చేయాలని, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి సంయుక్త కలెక్టర్, డిఆర్ఓ జి

స్మార్ట్ మీటర్లు వద్దు..

- ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలి
- ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నేటి నుంచి ఇంటింటికీ ప్రచారం..

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

'స్మార్ట్ మీటర్లు వద్దు.. ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలి' అనే నినాదంతో ప్రజాసంఘాల ఐక్యవేదిక, ఒంగోలు నగర కమిటీలు సిఐటియు జిల్లా కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం సమావేశమయ్యాయి. శనివారం నుంచి నగరంలో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేసి.. సంతకాల సేకరణ కార్యక్రమం చేపడతామని నిర్వాహకులు తెలిపారు. సిఐటియు నగర అధ్యక్షుడు సిహెచ్.రాంబాబు, ఎంఎం.సాయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్లు వినియోగదారులపై భారమని, అదానీ వంటి కంపెనీలకు లాభాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోచిపెట్టేందుకేనని విమర్శించారు. ఒక సింగిల్ ఫేజ్ మీటర్‌కు రూ.9 వేలు, త్రీఫేజ్‌కు రూ.18 వేలు ఖర్చు వినియోగదారులే భరించాల్సిన పరిస్థితి దారుణమని అన్నారు. సిఐటియు పూర్వ రాష్ట్ర కార్యదర్శి వై.సిద్ధయ్య మాట్లాడుతూ 2014 నుంచి 2022 వరకు విద్యుత్ సంస్థలకు ప్రభుత్వం చెల్లించాల్సిన వేల కోట్లను వినియోగదారులపై భారం మోపి 'ట్రూ అప్' ఛార్జీల రూపంలో వసూలు చేయడం దారుణమని విమర్శించారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ, జనసేన పార్టీలు ఈ భారాలను రద్దు చేస్తామని చెప్పి, ఇప్పుడు మౌనంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పౌరసంఘాల సమైక్య కన్వీనర్ జి.రమేష్, సిఐటియు ఒంగోలు నగర కార్యదర్శి టి.మహేష్, ఐద్వా నగర కార్యదర్శి జి.ఆదిలక్ష్మి, ఏపీ మెడికల్ యూనియన్ ఒంగోలు బ్రాంచి అధ్యక్షులు సిహెచ్. చిరంజీవి, ఏఐటియుసి జిల్లా నాయకులు పి.సుబ్బారావు, పోలయ్య, సిఐటియు నాయకులు దామా శ్రీనివాసులు, ఎన్.వీరాస్వామి, ఆటోవర్కర్స్ యూనియన్ ఒంగోలు నగర కార్యదర్శి తంబి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తుపాను విపత్తును ఎదుర్కోవడానికి

అధికారులు సంసిద్ధంగా ఉండాలి..

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



కలెక్టర్ వెంకటమురళి

వర్షాకాలంలో తుపాను హెచ్చరికల నేపథ్యంలో విపత్తును ఎదుర్కోవడానికి అధికారులు సంసిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. విపత్తు నిర్వహణ, నిర్మూలన ప్రణా ళికపై జిల్లా, మండల స్థాయి అధికారులతో శుక్రవారం అయన సమావేశం నిర్వహించారు. ఎగువ ప్రాంతాలలో అధికంగా వర్షాలు కురుస్తున్నందున కష్ణానది వరద విపత్తును దష్టిలో ఉంచుకోవాలని కలెక్టర్ చెప్పారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విపత్తును ఎదుర్కోవడానికి ముందస్తుగా ప్రణాళిక రూపొందించాలన్నారు. జిల్లాకు తుపాను, అధిక వర్షాలు, వరద విపత్తు నష్టాన్ని తెచ్చే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం ఆలమట్టి, శ్రీశైలం, నాగార్జున సాగర్, కష్ణ బ్యారేజి 90 శాతం నిండుగా ఉండడంతో ఎగువ నుంచి వరద వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కృష్ణానది కరకట్టపై నివాస ముంటున్న గృహాల సర్వే చేయాలన్నారు. కరకట్టకు గండ్లు పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా ఇన్చార్జి సంయుక్త కలెక్టర్, డిఆర్ఓ జి గంగాధర్ గౌడ్, ఆర్ డి ఓ లు, జిల్లా అధికారులు, వీక్షణ సమావేశం ద్వారా మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చిన కూటమి ప్రభుత్వం

రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-కర్లపాలెం



సుపరిపాలన కార్యక్రమంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చిన కూటమి ప్రభుత్వం ప్రజల మన్ననలను అందుకుంటుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. కర్లపాలెం మండలం కొత్తనందాపాలెంలో శుక్రవారం జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి , బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పాల్గొన్నారు. కర్లపాలెం మండలం కొత్తనందాపాలెం గ్రామానికి తొలిసారిగా వచ్చిన మంత్రి రాంప్రసాద్ రెడ్డికి బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పలువురు టిడిపి నేతలు స్వాగతం పలికారు. ముందుగా ఐదరపేట నుండి కొత్త నందాయపాలెం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, బాపట్ల నియోజకవర్గం పరిశీలకులు శివసాంబిరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి జయప్రకాష్ నారాయణ, కర్లపాలెం మండల అధ్యక్షుడు భూపతిరావు పాల్గొన్నారు.

'బంగారు కుటుంబాల దత్తత'ను

త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పి4 కార్యక్రమంలో నేనున్నానంటూ కుప్పం నియోజకవర్గంలో 250 బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర సచివాలయం నుండి కలెక్టర్లతో వీక్షణ సమావేశం నిర్వహించారు. స్వర్ణ ఆంధ్ర , పి-4 కార్యక్రమం అమలు గురించి ఆయన జిల్లా కలెక్టర్లకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి, బాపట్ల శాసనసభ్యులు వేగేశిన నరేంద్ర వర్మ రాజు హాజరయ్యారు. బంగారు కుటుంబాల దత్తత కార్యక్రమం త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా కలెక్టర్లకు సూచించారు. ప్రతి ఒక్కరూ ఒక కుటుంబాన్ని దత్తత తీసుకొని వారిని ముందుకు తీసుకువెళ్లాలని తెలిపారు.